46వ చిన్న శోధ యాత్రానుభవాలు

నా పేరు వంశీ ప్రియ. నా వయసు 36 సంవత్సరాలు. మా వారి పేరు రాజేష్. వారి వయసు 38 సంవత్సరాలు. మాకు ఇద్దరు అబ్బాయిలు. పెద్దబ్బాయి హరికి 11 సంవత్సరాలు. చిన్నవాడు శివకి 8 సంవత్సరాలు.

చాలా కారణాల వల్ల మేము చదువుకున్న చదువుకు చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోయింది. చదువుకునేటప్పుడే వ్యక్తిగా సమాజంలో మా పాత్ర, భవిష్యత్తులో చేయవలసిన పనులకు సంబంధించిన అవగాహన, తగిన సామర్థ్యాలు పెంపొందించే విధంగా లేకపోవడం అందుకు కారణం అని తెలుసుకున్నాము.

అందుకే మా పిల్లలకు విలువలు నైపుణ్యాలతో కూడిన అనుభవ పూర్వకమైన విద్యను అందించే ప్రయత్నంలో ఉన్నాము. అందులో భాగంగానే మేమందరం కలిసి శోధ యాత్రకు వచ్చాము.

మొదటిరోజు

యాత్ర ప్రారంభ స్థలాన్ని చేరుకోగానే ఆప్యాయంగా పెద్దాయన(గణేశం గారు) పలకరించారు. వారు 33వ శోధ యాత్రలో పాల్గొన్న మా పెద్దబ్బాయిని, శ్రీవారిని గుర్తుంచుకోవడం ఆశ్చర్యాన్ని ఆనందాన్ని కలిగించింది. అలాగే సహయాత్రికులు అఖిల,పవన్ లు మా పెద్దబ్బాయితో ఇదివరకు వారికి ఉన్న పరిచయాన్ని  గుర్తు చేయడమే కాకుండా అప్పుడే కలిసిన మా చిన్నబ్బాయితో కలుపుగోలుగా వ్యవహరించడం చాలా బాగా అనిపించింది. కొత్త వాళ్లను కలిసినట్టు కాకుండా చాలా కాలంగా పరిచయం ఉన్న ఆత్మీయులను కలిసిన భావన కలిగింది.

ఎంతో దూరం నుండి ప్రయాణించి వచ్చినా సహయాత్రికులు అందరూ ఉత్సాహంగా కనిపించారు. పరిచయ కార్యక్రమంలో అందరూ ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. పెద్దాయన చెప్పిన నలుగురు గురువుల (ప్రకృతి,పల్లెవాసులు,సహయాత్రికులు,నేను) సత్సాంగత్యంతో యాత్ర మొదలైంది.

హరిశివులు అఖిల బృందంతో కలిసి పాఠశాల విద్యార్థులను కలవడానికి వెళ్లారు. వారెలా ఉంటారో అన్న ఆలోచన కూడా రాలేదు. దాని తర్వాత యాత్రలో ఎప్పుడో వారు కనబడినప్పుడు చూడడమే కానీ.. వారు ఎవరితో ఉన్నారో.. ఎక్కడ ఉన్నారో అని పట్టించుకోవాల్సిన అవసరం రాలేదు. ఒక పెద్ద కుటుంబం కలిసి కాలినడకన ప్రయాణిస్తున్నట్టే అనిపించింది.

పెద్దాయన మాటలు వింటూ..సహయాత్రికుల జీవన ప్రయాణం గురించి తెలుసుకుంటూ..మా జీవన అనుభవాలు తెలియజేస్తూ..యాత్ర ముందుకు సాగుతోంది.

కొద్ది దూరం నడిచిన తర్వాత తేనీరు సేవించడానికి దారి పక్కన కొద్దిసేపు విశ్రాంతిగా కూర్చున్నాము. పెద్దాయన ఆవిష్కర్తల కథలతో పాటు ఎన్నో ఆసక్తికర విషయాలు తెలియజేశారు.

తిరిగి యాత్ర కొనసాగిస్తూ దారిలో కనిపించిన వారికి పల్లె సృజన మాస పత్రిక మరియు శోధయాత్రకు సంబంధించిన కరపత్రాన్ని ఇచ్చి యాత్ర యొక్క ఉద్దేశాన్ని తెలియజేస్తూ ముందుకు సాగాము.

ఈసారి విశ్రాంతి సమయంలో ఆరోగ్యానికి సంబంధించిన చర్చ జరిగింది. ఆచారం వ్యవహారం సంస్కారం ద్వారానే ఒక వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలుగుతాడని తెలుసుకున్నాము. తిరిగి యాత్ర కొనసాగించాము.

మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆ పొలం యజమానితో మాట్లాడడం, ఆయన ఒక ఆదర్శ రైతని గుర్తించి సన్మానించడం, వారికి కావలసిన సహకారాన్ని అందిస్తామని హామీ ఇవ్వడం, వారి గురించి మరింత మందికి తెలియజేయడం కోసం ప్రత్యేకించి కొంతమంది సహయాత్రికులు వారిని ఇంటర్వ్యూ చేయడం చాలా బాగా అనిపించింది.

దారిలో కనిపించిన చేతి బోరు పంపు రూపకల్పన లోపం గురించి పెద్దాయన వివరించడం, దాన్ని ఎలా పరిష్కరించవచ్చో చర్చించడం ఆలోచనత్మకంగా ఉంది. ఇతరుల సమస్యల పట్ల సంవేదన కలిగి ఉండాల్సిన ఆవశ్యకతను గుర్తించాము.

యాత్రని కొనసాగిస్తూ సాయంకాలనికి ఒక పాఠశాలను చేరుకున్నాము. అఖిల విద్యార్థులతో వ్యవహరించిన విధానం చాలా బాగా అనిపించింది. పిల్లలందరూ చాలా చురుగ్గా చర్చలో పాల్గొన్నారు. అఖిల ప్రశ్నలకు కొందరు పిల్లల సమాధానం ఆశ్చర్యాన్ని కలిగించింది. పిల్లలు ఇంత బాగా ఆలోచించగలరా అనిపించింది. ఉపాధ్యాయులందరూ ఇలాగే ఉంటే పిల్లలు సాధించలేనిది ఏది ఉండదనిపించింది.

తర్వాత కొంత దూరం ప్రయాణించిన తర్వాత ఒక చెరువు దగ్గర ఆగాము. హరిశివులు కొంతమంది సహయత్రికులతో కలిసి ఆనందంగా నీటిలో ఆడుకున్నారు.

కొంతసేపటికి చీకటి పడింది. కొత్త ప్రదేశం చుట్టూ చీకటి అయినా పెద్దాయన చెప్పిన రాత్రి నియమాలు పాటిస్తూ ఎలాంటి భయము లేకుండా సహయాత్రికులతో మాట్లాడుకుంటూ ఒక గ్రామాన్ని చేరుకున్నాము.

అక్కడి గ్రామస్తుల సమస్యలు పెద్దాయన అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ఆవిష్కరణల వలన వారికి కలిగే ప్రయోజనాలు మౌఖికంగా వివరించారు మరియు వీడియోల ద్వారా చూపించారు.

తర్వాత మేమందరం రాత్రి విశ్రాంతి తీసుకునే ప్రదేశాన్ని చేరుకున్నాము. అందరూ వారి యాత్ర అనుభవాలు గురించి అందరితో పంచుకున్నారు. మనం గమనించని ఎన్నో విషయాలు ఇతరుల ద్వారా వినడం వారి ఆలోచనలను అర్థం చేసుకోవడం చాలా ఉపయోగకరంగా అనిపించింది.

రాత్రి భోజనానంతరం భాద్రపద పున్నమి వెన్నెల్లో అందరం విశ్రమించాము.

రెండవ రోజు

మగవారందరూ కాలువలో స్నానానికి వెళ్లారు. ఆడవారికి గ్రామంలోని ఒక ఇంటిలో స్నానాదులకు వ్యవస్థ చేశారు.

అందరూ తయారైన తర్వాత గ్రామస్తుల కోసం ఆవిష్కరణలకు సంబంధించిన కొన్ని ఫ్లెక్సీలను, పనిముట్లను, కలుపు మందులు ఎరువులు మొదలైన వాటిని ప్రదర్శించడం జరిగింది. పెద్దాయన అందరికీ అన్నీ ఓపిగ్గా వివరించారు. ఆసక్తి కలిగిన వారు కొన్ని కొనుగోలు కూడా చేశారు. మిగిలిన వారు అవసరమైతే సంప్రదించడానికి పల్లె సృజన సంప్రదింపు కార్డులను ఇవ్వడం జరిగింది.

తర్వాత తిరిగి మేము బస చేసిన గ్రామ సచివాలయంలో సమావేశమయ్యి కృష్ణ గారు ప్రతిపాదించిన రైతు సమస్యల గురించి చర్చించాము. సమస్య ఉందని అర్థం అవుతున్నా పరిష్కారం మాకు ఎవరికీ తోచకపోవడం విచిత్రంగా అనిపించింది. సంవేదన లేకపోవడమే ఇందుకు కారణమని గుర్తించాము. పెద్దాయన చెప్పినట్లు విత్తనాన్ని రైతే తయారు చేసుకోవడం ఎంత అవసరమో తెలుసుకున్నాము. అల్పాహార సమయంలో కూడా చర్చ కొనసాగింది.

చర్చ అనంతరం మా యాత్ర ప్రారంభించాము. కొంత దూరం నడవగానే దట్టమైన అటవీ ప్రాంతంలోకి ప్రవేశించాము. చిన్న కాలువలు, పచ్చటి చెట్లతో మా తొలి గురువు ప్రకృతి ఎంతో రమణీయంగా సాక్షాత్కరించింది. పార్కులను చూసి పరవశించిపోయే మేము అడవి అందాలను చూసి మైమరిచిపోయాము.

మా మూడవ గురువు సహయాత్రికుల ముచ్చట్లతో ముందుకు సాగాము. సంజయ్ గారు పాడిన హిందీ గేయం कोशिश करने वालों की हार नहीं होती స్ఫూర్తి నింపింది.

మధ్యలో పెద్దాయన తో నా జీవిత ప్రయాణం గురించి మాట్లాడే అవకాశం రావడం.. వారు ఎంతో ఓపికగా వినడం.. నా సందేహాలకు సమాధానం ఇవ్వడం చాలా సంతోషాన్ని కలిగించింది. మనం నడుస్తున్న మార్గం సరైనదే అని వెన్ను తట్టి ప్రోత్సహించేవారు దొరకడం ఎవరికైనా అదృష్టమే కదా.

దారిలో చిరుజల్లు కురిసినా మా యాత్ర ఆగలేదు. మధ్యాహ్నం భోజన సమయానికి ఒక పాఠశాలను చేరుకున్నాము.

భోజనానంతరం మాతో సమయం గడపడానికి విచ్చేసిన ఆవిష్కర్త, రాష్ట్రపతి అవార్డు గ్రహీత శ్రీ మహిపాల్ ఆచారి గారిని కలవడం ప్రేరణ కలిగించింది. అలాగే మా యాత్రలో పాల్గొంటున్న పట్టు వదలని విక్రమార్కుని వంటి పరిశోధకులు రాములు గారి అకుంఠిత దీక్ష ఆశ్చర్యాన్ని కలిగించింది.

తిరిగి యాత్రను కొనసాగించాము. చీకట్లు పడ్డ తర్వాత ఒక అరగంటసేపు మౌన యాత్ర సాగించాము. పున్నమి వెన్నెల, మినుగురు పురుగుల మిలమిల లలో అడవిలోని పురుగుల పక్షుల వింత వింత శబ్దాలను వింటూ చల్లటి వాతావరణం లో ముందుకు కదిలాము.

మా రాత్రి బసకు చేరుకుని క్రితం రోజు లాగానే అనుభవాలు పంచుకొని భోజనం చేసి విశ్రాంతి తీసుకున్నాము.

మూడవరోజు

క్రితం రోజు లాగానే తయారయ్యి, అందరం కలిసి చర్చించుకుని, అల్పాహారం చేసి గ్రామస్తులతో ముచ్చటించాము. LCD టీవీ ద్వారా ఆవిష్కరణలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించాము.

ఒకానొక గ్రామస్తుని ఇంటిలో 23 రకాల ఆకుకూరలు కూరగాయలు తీగ జాతులు దుంప జాతుల మొక్కలు చూసి అభినందించి దంపతులిరువురినీ సన్మానించాము. గ్రామ అభివృద్ధిలో క్రియాశీలంగా వ్యవహరిస్తున్న సర్పంచ్ గారిని కూడా సన్మానించాము.

తరువాత యాత్రను ప్రారంభించి కొద్ది దూరం నడిచిన తర్వాత మేధా గారు फेको मत् గురించి వివరించారు. Extramile నాగమోహన్ గారు వారి సంస్థ కార్యక్రమాల గురించి తెలియజేశారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి మోడీ గారి పిలుపుని అనుసరించి అందరం కలిసి వన ప్రేమికుడు జాజి గారిని తలుచుకొని అడవిలో కొంత భాగంలో ప్లాస్టిక్ గాజు వ్యర్థాలను ఏరి వేసాము.

తిరిగి యాత్ర కొనసాగింది. భరత్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా పెద్దాయన జ్ఞానశోధ గురించి వివరించారు. తరువాత మా వారితో మాట్లాడారు. పల్లెలు స్వయం సమృద్ధిగా ఉండాలంటే ఏం చేయాలో తెలియజేశారు. రైతు తన పొలం దాటే పని లేకుండా మనం సహకరించాల్సిన ఆవశ్యకతను గుర్తించాము. అన్నదాతను ఎంతగా క్షోభ పెడుతున్నామో అర్థం చేసుకున్నాము.

యాత్ర పరిసమాప్తికి సమయం దగ్గర పడుతున్నా దారిలోని గ్రామస్తుల అభ్యర్థనను మన్నించి పెద్దాయన వారితో మాట్లాడారు.

భోజన సమయానికి మా చివరి మజిలీ చేరుకున్నాము. భోజనానంతరం చివరిసారిగా మా యాత్ర అనుభవాలు, ఈ యాత్ర ద్వారా మేము నేర్చుకున్న ముఖ్య విషయాల గురించి మాట్లాడుకున్నాము. చివరిగా ఆవిష్కర్తలు మరియు ఈ కార్యక్రమ నిర్వహణలో మాకు ఎంతో సహకరించిన రాజు గారిని, రాములు గారిని సన్మానించడం జరిగింది.

పెద్దాయనకు నమస్కరించి ఎన్నో మధురమైన జ్ఞాపకాలతో మళ్ళీ వచ్చే శోధయాత్ర ఎప్పుడెప్పుడు జరుగుతుందా అని ఆసక్తిగా ఎదురు చూస్తూ అందరం తిరుగు ప్రయాణం అయ్యాము.

కొసమెరుపు:

యాత్ర ముగిసే లోపు సహయాత్రికులందరితో వ్యక్తిగతంగా మాట్లాడాలన్నది పెద్దాయన సలహా, మా అందరి సంకల్పం. కానీ సమయాభావం (కొందరితో మొదలుపెట్టిన సంవాదం ఎంతకీ ముగియక పోవడం) వలన అందరితో మాట్లాడలేకపోయాను. నేను మాట్లాడిన క్రమంలో అఖిల మానస పవన్ భరత్ చరిత్ అందరూ వయసులో చాలా

చిన్న వారైనా ఆలోచనల్లో అనుభవంలో గట్టివారని తెలుసుకున్నాను. వారి వయసులోనే మాకు అంత పరిణితి ఉండినట్లయితే ఎంతో సాధించేవారిమని అనిపించింది. ఒక తల్లిగా నాకు వీరు కొత్త పాఠాలు నేర్పారు.

ఇంక పెద్దాయన గురించి చెప్పగలిగే అంత శక్తి సామర్థ్యాలు నాకు లేవు. పోతన గారు అన్నట్టు

భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు,
శూలికైన తమ్మి చూలికైన.
విబుధ జనుల వలన విన్నంత కన్నంత
తెలియ వచ్చినంత తేట పరతు.

నమ్మిన సిద్ధాంతం కోసం ఎనిమిది పదుల వయసులో కూడా చెరగని చిరునవ్వుతో అవిశ్రాంతంగా కృషి చేయడమంటే మాటలు కాదు. వారితో నాది కేవలం మూడు రోజుల పరిచయం. పొద్దు పొద్దున్నే యాత్ర మొదలైనప్పటి నుండి రాత్రి ఎప్పుడో యాత్ర ముగిసేవరకూ ఆయన కూర్చున్న దాఖలాలు లేవు.. పల్లె వాసులతో మాట్లాడినా..విశ్రాంతి సమయాల్లో మాకు ఎన్నో విలువైన విషయాలు చెప్పినా..తేనీరు తాగినా.. ఆఖరికి మధ్యాహ్న భోజనం కూడా నిలబడే చేశారు. వారి కాళ్ళకే కాదు నోటికి కూడా క్షణం తీరికలేదు. వారి దగ్గరున్న జ్ఞానాన్నంతా మాకు పంచాలనే ఆరాటం అనుక్షణం కనిపించింది. వారి వాక్ ప్రవాహంలో మేమందరం మునిగి తేలే వాళ్ళం కానీ ఎన్నడూ దాహమని కూడా అనిపించేది కాదు వారికి. నిజంగా మిలిటరీ ట్రైనింగ్ తీసుకున్న వారందరూ ఇలాగే ఉంటారంటే నమ్మడం కొంత కష్టమే.

విజ్ఞానఖనులైన వీరి సహచర్యంతో వృద్ధులు-మధ్య వయస్కులు-యవ్వనులు-బాలురు అందరూ సమానంగా లబ్ది పొందారు. నా చిన్నప్పుడే మా నాన్నగారు పోయారు.. మా వివాహానికి ముందే మా మామయ్య గారు పోయారు.. నా పిల్లలకు పెద్దదిక్కు లేరనే బాధ ఉండేది. కానీ వారికి భగవంతుడు ఇంత గొప్ప తాత గారిని ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. వీలైనప్పుడు కాదు వీలు చేసుకుని మరీ వారి సాన్నిహిత్యాన్ని పిల్లలకు అందించడం ఇప్పుడు నా బాధ్యత.

గురుతుల్యులైన సహయాత్రికులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదములు. పితృ సమానులైన గణేషం గారికి పాదాభివందనాలు.
స్వస్తి.

రాజవంశీ
విశ్వామిత్ర - వైదిక జీవన అభ్యాస కేంద్రం
శ్రీ వసిష్ఠాశ్రమం - వైకుంఠపురం
తిరుపతి జిల్లా